క్లుప్తంగా

రూ.1.65 కోట్లు పలికిన వారాంతపు సంత

తుక్కుగూడ: తుక్కుగూడ వారాంతపు సంత (తైబజార్) రూ.కోటి 65 లక్షల 25 వేల పలికినట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వారాంతపు సంత వేలం పాట శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించమన్నారు. ఇందులో 17 మంది పాల్గొన్నగా మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామవాసి పేల రాజు వేలం పాడి దక్కించుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, కౌన్సిలర్లు శివకుమార్, విలాస్, సుమన్, భావన, రాజు, మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది జంగయ్య, మల్లేశ్, స్థానికులు పాల్గొన్నారు.

వేంనరేందర్‌రెడ్డిని కలిసిన ఏనుగు జంగారెడ్డి



కందుకూరు: ప్రభుత్వం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రస్థాయిలో ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చేలా చూడాలని కోరారు.

గడ్డిఅన్నారం డివిజన్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి



డీసీకి మొక్కను బహూకరిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: డివిజన్‌లో ఉన్న రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సరూర్‌నగర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాతకు విజ్ఞప్తి చేశారు. డీసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను శుక్రవారం మర్యాపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని డీసీని కార్పొరేటర్ కోరారు.

ఇష్టంతో చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఆయన హాల్ టికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ, గుండు వెంకటేశ్వర్లు, కన్నయ్య, బాలరాజు, సంగీత, గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ప్రఖ్యాతి చెందిన కొహెడాలోని రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవేందర్‌రెడ్డి ఎన్నిక కాగా డైరెక్టర్లుగా బాల్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, కావ్య ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాల్‌రాజ్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్ కష్టాలే!



ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



రహదారిపైనే పార్కు చేసిన వాహనాలు

కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలు కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం వాహనాలను అడ్డదిడ్డంగా ఇష్టం వచ్చినట్లు నడపడం, రహదారిపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

- రద్దీ వేళల్లో కనిపించని ట్రాఫిక్ సిబ్బంది
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారుల అవస్థలు
- కూడలిలోని రహదారిపైనే వాహనాల పార్కింగ్

మీర్‌పేట: కార్పొరేషన్‌లో ప్రధాన కూడలి.. అటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి.. ఇటు బడంగ్‌పేట, ఆదిబట్ల మీదుగా ఓఆర్‌ఆర్‌కు ఈ కూడలి గుండానే వెళ్లాల్సి ఉంటుంది... ఎప్పుడు రద్దీగా ఉండే కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు కష్టాలు పడుతూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. బాలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉంటుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఉదయం వేళల్లో అయితే కూడలికి రెండు వైపులా వాహనాలు నిమిషాల కొద్ది నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఒక్క ట్రాఫిక్ పోలీసులు కనిపించరని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లు వెళ్తుండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

కనిపించని ట్రాఫిక్ సిబ్బంది..

ఇంత పెద్ద ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్య తరచూ ఉత్పన్నమవుతున్నా రద్దీ సమయంలో ట్రాఫిక్ సిబ్బంది ఒక్కరూ ఉండరని, ఉదయం 10 గంటలు దాటాకా లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తారని, అది కూడా నిబంధనలు పాటించని వాహనాలకు చలాన్లు విధించేందుకు మాత్రమేనని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇక చౌరస్తాకు రెండువైపులా ఆర్టీసీ బస్సులు, లేదా ఇతర భారీ వాహనాలు మలుపు తీసుకునే చోట రహదారి ఇరుకుగా ఉండడంతో ఇతర వాహనాలు కొంతసేపు నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెప్పారు. ఓ వైపు ట్రాఫిక్, మరో వైపు చౌరస్తాలోని రహదారిపై వాహనాలు అడ్డగోలుగా పార్కు చేయడంతో కూడలి దాటే వరకు చాలా ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ వేళల్లో, ట్రాఫిక్ సమస్య తలెత్తే చోట సిబ్బంది అందుబాటులో ఉంటే వాహనదారుల అవస్థలు తీరుతాయన్నారు. ట్రాఫిక్ అధికారులు స్పందించి కూడలిలో అన్ని వేళల్లో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కందుకూరు: గ్రామాల్లో మౌలిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్, గోపాల్, ఎంపీడీఓ సరిత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వందశాతం పూర్తి చేయాలని సూచించారు. అలాగే, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు పనులు పెంచి, పని ప్రదేశాల్లో నీడ, మంచినిటి సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఆమనగల్లు: రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేస్తుందని అన్నారు. వివిధ కులాలకు చెందిన సంఘాలు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా కోరుతున్నాయని.. వారి కోరికను నెరవేర్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

మన్సూరాబాద్: డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు యాదగిరి, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణగుప్తా, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, చేతి వృత్తులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని అన్నారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

ఎంసీ సమావేశానికి హాజరైన డైరెక్టర్లు

- 30న సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయం
- పెండింగ్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ అవిశ్వాస కేసు తీర్పు



సమావేశానికి హాజరైన సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు

ఇబ్రహీంపట్నం: శేరిగూడలోని ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మేనేజ్‌మెంట్ కమిటీ (ఎంసీ) సమావేశానికి డైరెక్టర్లలందరూ హాజరయ్యారు. పీఏసీఎస్ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌పై 11 మంది డైరెక్టర్లు గత నెలలో అవిశ్వాసం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సరైన పద్ధతిలో అవిశ్వాస ప్రక్రియ లేదని చైర్మన్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో అవిశ్వాస సమావేశం గతనెల 22న నిర్వహించినప్పటికీ.. కోర్టు ఆదేశాల మేరకు అందులోని అంశాలను, వివరాలను గోప్యంగా ఉంచి నివేదికను తమకు సమర్పించాలని న్యాయస్థానం పేర్కొంది. ఈ మేరకు ఆ ప్రక్రియను సంబంధిత అధికారులు పూర్తిచేశారు. ఈనెల 7, 12వ తేదీల్లో కేసును విచారించిన న్యాయస్థానం తీర్పును రిజర్వు ఫర్ ఆర్డర్‌లో పెట్టింది. అప్పటి వరకు సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా కొనసాగనున్నారు. అయితే ఈ తీర్పు ఎలా వస్తుందో అనే సస్పెన్స్ ఇంకా కొనసాగతుంది.

సమావేశం తప్పనిసరి....

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ రూపకల్పన కోసం తప్పనిసరిగా పాలక వర్గం సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. ఈ దశలో బుధవారం నిర్వహించిన ఎంసీ సమావేశానికి చైర్మన్, వైస్ చైర్మన్లు హాజరుకాగా 11 మంది డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. తిరిగి శుక్రవారం చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వైస్ చైర్మన్ క్యామ శంకర్‌తో పాటు డైరెక్టర్లందరూ హాజరుకావడం విశేషం. ఈ సమావేశంలో ఈనెల 30వ తేదీన వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. కాగా ఈ లోపు న్యాయస్థానం తీర్పు వెలువరిస్తే పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాల్సిందే.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



కడ్తాల్: చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అంగన్‌వాడీల్లో పోషణ అభియాన్ కార్యక్రమాలు

- పౌష్టికాహారంపై అవగాహన కల్పించిన ఐసీడీఎస్ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుధాన్యాలను దినసరి ఆహారంలో భాగస్వామ్యం చేసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోషణ్ అభియాన్ అవగహ న సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాలపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పించారు. తినే ఆహారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పుదినుసులు వంటివి సంపూర్ణంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయడు కృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్ ఆండాలు, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్, గ్రామస్తులు పాల్గొన్నారు .

కడ్తాల్ మండల పరిధిలో..

కడ్తాల్: చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్లు సుగుణమ్మ, లీలావతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి అంగన్‌వాడీ పాఠశాలలో పోషణ పక్షం, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల చిరుధాన్యాలతో పోషకాహారం ఏ విధంగా లభిస్తోందో చిన్నారులకు, తల్లులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, విద్యార్థుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

గౌరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

తలకొండపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. మండల పరిధిలోని గౌరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుకూరలు, కాయగూరలు, చిరుధాన్యాలతో పోషక ఆహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. విటమిన్లు, ప్రొటీన్లు, మిల్లెట్స్, తదితర పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నట్లైతే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఆహారలేమితో గర్భిణులు, కిశోర బాలికలు, తల్లులు, మహిళలల్లో రక్తహీనత వచ్చే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, శైలజ, సూపర్‌వైజర్ కవిత, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

యాచారం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దిల్‌షుఖ్‌నగర్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ.రషీద్ చలివేంద్రాన్ని ప్రారంభించాడు. ఎండల తీవ్రత అధికమవ్వడం, బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం సొంత ఖర్చుతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు రషీద్ తెలిపారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం 21వ వార్డులో కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మతో కలిసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, జూట్ బ్యాగ్‌లను వినియోగించాలని, చెత్తను సేకరించే ఆటోలకు మాత్రమే చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నాగేష్, ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా



గౌస్‌ను సన్మానించిన నాయకులు

కడ్తాల్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మసీద్ వద్ద స్థానిక ముస్లిం నాయకుడు గౌస్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మసీద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, నాయకులు జహంగీర్‌అలీ, ఇర్షాద్, మహేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

తొలి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు..

కడ్తాల్: రంజాన్ మాస తొలి శుక్రవారం రోజున స్థానిక మసీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మజీద్ కుబా, మజీద్ అర్షద్‌లో ఉపవాస దీక్షలు చేపట్టినవారికి ఇఫ్తార్ విందు ఇచ్చారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, మైనార్టీ నాయకులు గౌస్, ఇర్షాద్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: పవిత్ర రంజాన్‌మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని పలు మసీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని జామై మసీదు, మహ్మదీయ మసీదు, అహ్మద్ హిలాల్ మసీదులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా మసీదులలో ఇమామ్‌లు ప్రత్యేక బోధనలు చేశారు. ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణ వేడుకలో ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు



స్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

- కనులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం
- ప్రత్యేక పూజలు చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- భారీగా భక్తుల హాజరు

కడ్తాల్: కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బ్యాండు మేళాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆలయంలోని కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను తిలకించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రాములుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భారతమ్మ నర్సింహగౌడ్, ఈఓ మోహన్‌రావు, నాయకులు భీష్మాచారి, బాలకృష్ణగౌడ్, రాజీవ్, గోపాల్‌గౌడ్, వెంకటయ్య, లక్ష్మయ్యగౌడ్, యాదయ్య, సత్యశీలారెడ్డి, జంగయ్యగౌడ్, నర్సింహ, దర్గయ్య, రాములుగౌడ్, యాదయ్య, ఉన్నారు.

ఆర్చి నిర్మాణ పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని టీసీఎస్ ఎదుట ఉన్న మరియపురం పట్టణంలోకి వెళ్లే దారిలో శుక్రవారం అర్చి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిబాబ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దాత జయరాజ్, ఆరోగ్యమ్మ, తిరోజమ్మ, అరుణ్, సూరి తదితరులు పాల్గొన్నారు.